మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి


# మనం
జనం కోసం అక్షర యజ్ఞం...

ఉమ్మడి
## ఉత్తరాంధ్ర జిల్లాలు

సోమవారం | 14 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08


# బిజినెస్ ఎక్స్‌పోను సందర్శించిన హోం మంత్రి అనిత



**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని గదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న బిజినెస్ ఎక్స్‌పో--2026ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మూడో రోజు సందర్శించారు. ఈ సందర్భంగా బిజినెస్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను హోం మంత్రి అనిత పరిశీలించారు. ఎక్స్‌పోకు విచ్చేసిన హోం మంత్రి అనితకు ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఛాంబర్స్ ప్రతినిధులు హోం మంత్రి అనితకు ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను చూపిస్తూ, ఆయా సంస్థలు, ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన వివరాలను వివరించారు. స్టాల్స్‌ను ఆసక్తిగా పరిశీలించిన హోం మంత్రి.. వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధి, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇలాంటి ఎక్స్‌పోలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. బిజినెస్ ఎక్స్‌పోలో వివిధ రంగాలకు చెందిన వ్యాపార, పారిశ్రామిక సంస్థలు పాల్గొని తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తున్నాయి.మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖపట్నం జిల్లా కలెక్టర్




అభిషిక్త్ కిశోర్ కార్యక్రమంలో ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులు, నిర్వాహకులు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు చర్యలు : గంటా



**భీమునిపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :**నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. నీటి ఎద్దడిపై మున్సిపల్ మంత్రి నారాయణ సహా విశాఖ, విజయనగరం జిల్లాల కలెక్టర్లు, జీవీఎంసీ కమిషనర్, నీటిసరఫరా అధికారులతో ఆదివారం ఫోన్ లో మాట్లాడారు. కనీస అవసరాలకు సైతం నీరు లేక ఎంవీవీ సిటీ ఫ్లాట్ లలో నివాసముంటున్న వారు ఎదుర్కొంటున్న ఇబ్బందిని అధిగమించేలా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని సూచించారు. 6 కిలో లీటర్లు, 12 కిలో లీటర్ల ట్యాంకర్ల ద్వారా 1.44 లక్షల లీటర్ల నీటిని ఎంవీవీ సిటీకి సరఫరా చేసినట్టు తెలిపారు. నీటి సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లు పంపాలన్నారు. వర్షాభావం వల్ల తాగునీరు సహా వాడుక నీటి సమస్య తలెత్తిందని, మధురవాడ పరిసర ప్రాంత ప్రజలకు నీటి కష్టాలు తీర్చడానికి రూ.550 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్టు పేర్కొన్నారు. తాగునీటి ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని విశాఖ ప్రజల నీటి అవసరాలను తీర్చడానికి తాటిపూడి రిజర్వాయర్ నుంచి సరఫరా పునరుద్ధరణ అత్యావశ్యకమని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ నీరు అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎలాంటి సమస్య ఉండదన్నారు. స్థానికంగా ఉన్న నీటి వనరుల నుంచి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీరందించే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. మధురవాడ, భీమిలి జోన్ లలో నీటి సమస్య తీవ్రత తగ్గించేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు.

### డీఎస్సీపై గొడ్డలి పార్టీ దుష్ప్రచారం

# అభ్యర్థులే వాస్తవాలు చెబుతున్నారు

- చంద్రబాబు నాయకత్వంలో యువతకు ఉద్యోగ భరోసా.. లోకేశ్ చొరవతో నియామకాలకు వేగం
- డీఎస్సీ పై బురదజల్లడం జగన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం
- పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే

**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :**డీఎస్సీ ఎంపిక ప్రక్రియపై గొడ్డలి పార్టీ, జగన్ రెడ్డి చేస్తున్న దుష్ప్రచారానికి అభ్యర్థులే వాస్తవాలతో సమాధానం చెబుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థిని కలిసి ఎంపిక ప్రక్రియపై స్వయంగా వివరాలు తెలుసుకున్నారు. పరీక్ష, కౌన్సెలింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రతి దశలోనూ పారదర్శకత పాటించామని అభ్యర్థి స్పష్టం చేసినట్లు పల్లా తెలిపారు.

**16 వేల పోస్టులు..వంద శాతం పారదర్శకత**

డీఎస్సీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని పల్లా



2వ పేజీలో

# అభ్యర్థులే వాస్తవాలు చెబుతున్నారు

**ఒకటి తరువాయి** తెలిపారు. 16 వేల పోస్టుల భర్తీలో ఎక్కడా చిన్నపాటి పొరపాటుకు కూడా తావులేకుండా ప్రతి దశను నిబంధనల ప్రకారం పూర్తి చేశామని స్పష్టం చేశారు. క్రీడా కోటాలోనూ అభ్యర్థుల అర్హతలు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి స్థాయిలో ధ్రువీకరణ చేపట్టామని చెప్పారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా వంద శాతం పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన నియామకాలు జరిగాయని పల్లా స్పష్టం చేశారు. ఎక్కడైనా అక్రమం జరిగిందని ఆరోపిస్తున్న వారు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు.

**దొంగే దొంగ అన్నట్లు గొడ్డలి పార్టీ తీరు**

వైసీపీ హయాంలో డీఎస్సీ నిర్వహణలో నిర్లక్ష్యం చూపిన వారు ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేపట్టిన నియామక ప్రక్రియపై బురదజల్లడం విడ్డూరంగా ఉందని పల్లా మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీలో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే ప్రజల దృష్టిని మళ్లించేందుకు డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పల్లా విమర్శించారు. అభ్యర్థులు ఎన్నో నెలలు, సంవత్సరాలు కష్టపడి సాధించిన ఉద్యోగాలను రాజకీయ రాద్ధాంతంలోకి లాగడం జగన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

**చంద్రబాబు పాలనలో యువతకు భరోసా**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పల్లా తెలిపారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో నియామక ప్రక్రియలకు వేగం వచ్చిందని, మెరిట్‌కు పెద్దపీట వేస్తూ యువతకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని జగన్ రెడ్డికి హితవు పలికారు. ఎన్ని కుట్రలు, ఎన్ని ఆరోపణలు చేసినా వాస్తవాలను కప్పిపుచ్చలేరని.. డీఎస్సీపై గొడ్డలి పార్టీ చేస్తున్న రాద్ధాంతాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పల్లా స్పష్టం చేశారు.

### ఆత్రేయ కళాపీఠం, ఎం.వి.ఆర్. ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో

# ఘనంగా జరిగిన ఆత్రేయ స్మారక వేడుకలు

### మనసు కవి సాహిత్య ప్రస్థానాన్ని కొనియాడిన మాజీ ఎంపి బొత్స ఝాన్సీ



**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆచార్య ఆత్రేయ కళాపీఠం, ఎం.వి.ఆర్. ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య ఆత్రేయ 37వ వర్ధంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆత్రేయ స్మారక కళాపీఠం ప్రతినిధి గంటి మురళీధర్, ఎం.వి.ఆర్. ఈవెంట్స్ అధినేత ఎం.వి.ఆర్. నాగేశ్వరరావుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 'ఈనాటి ఈ బంధం ఏనాటిదో' శీర్షికన సినీ సంగీత విభావరి శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, కళాబంధు జి.వి. రామచంద్రరావు మాట్లాడుతూ.. మనసు కవి ఆత్రేయ ప్రతీ పాట మానవ సంబంధాలను, ప్రేమానురాగాలను అద్భుతంగా ఆవిష్కరించిందని, ఆయన సాహిత్యం తరతరాలకు ఆదర్శనీయమని కొనియాడారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న గంటి మురళీను వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మరొక ముఖ్య అతిథి పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఈ వేడుకలో ఈటీవీ 'స్వరాభిషేకం' ఫేమ్ గాయనీమణులు వీరలక్ష్మి, ఆకాంక్ష వల్లిలతో పాటు ఢిల్లీ-లండన్ విమాన పైలట్ ఆకొండి కిరణ్మయిని అతిథులు ఘనంగా సత్కరించారు. ఆత్రేయ కళాపీఠం, ఎం.వి.ఆర్. ట్రస్ట్ నిర్వాహకులు విచ్చేసిన అతిథులను, కళాకారులను దుశ్శాలువ, జ్ఞాపికలతో సంభావించారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జి.వి. రామచంద్రరావు సౌజన్యంతో హాజరైన వారందరికీ ఉచితంగా మట్టి వినాయక ప్రతిమ, పాలవెల్లి, పత్రి, గొడుగు, లడ్డూ మరియు పూజా వస్తువులతో కూడిన సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏడీసీపీ మహ్మద్ ఖాన్, సీనియర్ పాత్రికేయుడు ఎం.ఎస్.ఆర్. ప్రసాద్ తో పాటు పలువురు ప్రముఖులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు : జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

**ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలి - పిలుపు**

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** సోమవారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడు, గణనాథుడి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని, ప్రతి కుటుంబం అభివృద్ధితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లా పోలీసు శాఖ జారీ చేసిన భద్రతా సూచనలు, నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, అలాగే నిమజ్జన కార్యక్రమాలను కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు శాఖ సూచనల మేరకు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.

# వినాయక నిమజ్జనానికి ముందస్తు ఏర్పాట్లు

### భీమిలిలో భారీ నిమజ్జన ర్యాంప్ సిద్ధం

**భీమునిపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** భీమిలి సి.ఐ దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనానికి ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆదివారం గణేష్ నిమజ్జనం కోసం ప్రత్యేకంగా ర్యాంప్ ను సిద్ధం చేశారు. ఈ ర్యాంప్ నిర్మాణానికి 12 లారీల మట్టి, 3 లారీల క్రషర్ బొగ్గు, రోలర్లు, జేసీబీ లు ఉపయోగించి పటిష్టంగా ర్యాంప్ ను తయారు చేశారు. నిమజ్జనం రోజు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ సమస్య లేకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు సి.ఐ తెలిపారు.



# సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత

### కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనం



**సింహాచలం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా ఆదివారం సింహాచల క్షేత్రాన్ని సందర్శించి శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. పవిత్ర సింహాద్రి క్షేత్రంలో స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్నారు. హోంమంత్రి కుటుంబ సభ్యులకు ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు, ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు నాదస్వర మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా హోంమంత్రి వంగలపూడి అనిత స్వామివారి కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు అనంతరం నాదస్వర మంగళధ్వనులు, వేద మంత్రోచ్ఛారణల మధ్య బేడా మండపం ప్రదక్షిణ చేసి, అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారి అంతరాలయ దర్శనం చేసుకున్నారు. అనంతరం వేద పండితులు స్వామివారి ఆశీస్సులతో వేద ఆశీర్వచనం అందించారు. సింహాద్రి అప్పన్న వారి దివ్య కృపతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యం కలగాలని వేద పండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు హోంమంత్రి శ్రీమతి వంగలపూడి అనితకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ మర్యాదలతో బహూకరించారు. పవిత్ర సింహాచల క్షేత్రంలో స్వామివారి దర్శనం ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని, ప్రశాంతతను కలిగించిందని హోంమంత్రి కుటుంబ సభ్యులు తెలిపారు.



# పాత్రికేయులకు వినాయక పూజా సామగ్రి పంపిణీ



**ఆనందపురం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ):** వినాయక చవితిని పురస్కరించుకొని ఆనందపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కేఎన్‌బీ మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో మండలంలోని పాత్రికేయులకు మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్ప పుస్తకాలు, పండ్లు, పత్రిలు,స్వీట్లు పంపిణీ చేశారు. ఆదివారం ఆనందపురం జంక్షన్--బీపీ కల్లాలు రోడ్డులోని శుభశ్రీ ఫంక్షన్ హాల్లో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డబ్బీరు విజయ్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కేఎన్‌బీ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై పాత్రికేయులకు సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి కోరాడ నాగభూషణరావుకు పాత్రికేయులంటే ఎంతో గౌరవమని తెలిపారు. ట్రస్ట్ ప్రారంభమైన వెంటనే తొలి కార్యక్రమాన్ని జర్నలిస్టుల కోసం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తన తండ్రి స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని, పాత్రికేయులకు ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డబ్బీరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ వినాయక చవితిని పాత్రికేయ మిత్రులు కుటుంబ సభ్యులతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కేఎన్‌బీ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు కాగానే జర్నలిస్టులతో సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు, బీమా తదితర సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఆనందపురం ప్రెస్ క్లబ్ భవనానికి స్థలం కేటాయించేందుకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారని తెలిపారు. త్వరలోనే జర్నలిస్టుల కల సాకారం కానుందన్నారు. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దొంతల చిన్న శ్రీను, కోశాధికారి రౌతు నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న పాత్రికేయులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఎరుకొండ అప్పలరాజు, ఇతర ప్రతినిధులు కుప్ప రామలక్ష్మి, కనకల శ్రీనివాస్, నరసింహమూర్తి, తమ్మిన వెంకటరమణ, ముడసల శ్రీను, వెన్ని అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# టిప్పర్ ఢీకొని ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులు దుర్మరణం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ):** డ్యూటీ ముగించుకుని స్కూటీపై ఇంటికి వెళ్తున్న ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులను మృత్యువు కబళించింది. విశాఖలోని కూర్మన్నపాలెం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కొత్తూరుకు చెందిన కృష్ణ, రాంబాబు ఇద్దరూ మెడిటెక్ కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. రోజువారీ విధులు ముగించుకుని స్కూటీపై అనకాపల్లి వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ స్కూటీని ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. స్కూటీని టిప్పర్ బలంగా ఢీకొనడంతో ప్రమాద తీవ్రతకు ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కృష్ణ, రాంబాబు మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. డ్యూటీ ముగించుకుని క్షేమంగా ఇంటికి వస్తారని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు ఈ విషాద వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ప్రమాదంపై



పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

# పర్యావరణ పరిరక్షణ హితంగా మట్టి మహాగణపతి విగ్రహాల పంపిణీ!

## ఎ పిఎస్ డీన్ అండ్ కరస్పాండెంట్ డా.విజయ రవీంద్ర




**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని "ఆళ్వార్ దాస్ పబ్లిక్ స్కూల్ "డీన్ అండ్ కరస్పాండెంట్ డా. విజయ రవీంద్ర పేర్కొన్నారు. పర్యావరణ హితార్థం 'రీడ్ విద్యా సంస్థ' ల అధినేత డా.ఎస్ పీ రవీంద్ర నేతృత్వంలో స్థానిక ఎంవీపీ కాలనీలోని ఎపిఎస్ ప్రాంగణంలో వినాయక చవితి సందర్భాన్ని పురస్కరించుకొని పర్యావరణానికి మేలు చేసే మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా ఎపిఎస్ విద్యార్థులు వారి తల్లి దండ్రులకి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి డా.విజయ రవీంద్ర ఉచితంగా పంపిణీ చేశారు.ఈ వేడుకలలో స్కూల్ డైరెక్టర్ ఎస్ పి ఎం. దివ్యదాస్, ప్రిన్సిపాల్ పిఎల్. సుధ, కో-ఆర్డినేటర్ డి. గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మందు బాబులకు భారీ ఝలక్...!!

## భారీగా జరిమానా వసూలు




**ఆనందపురం , సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ):** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 77 మందికి భీమిలి న్యాయస్థానం భారీ జరిమానా విధించింది. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా ఆనందపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన మద్యం సేవించి వాహనం నడిపిన కేసులను శనివారం విచారించారు. ఈ కేసుల్లో నిందితులను భీమిలిలోని 15వ అదనపు మహానగర మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి పి. స్వాతి భవానీ 77 కేసులను విచారించి, ఒక్కో కేసులో రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. దీంతో మొత్తం రూ.7.70 లక్షల జరిమానా విధించినట్లయింది. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా కేసుల పరిష్కారంలో భాగంగా ఈ చర్య చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారులతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా బాధ్యతగా వ్యవహరించాలని వాహనదారులకు సూచించారు. రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# పశ్చిమ నియోజకవర్గంలో విజయ సంకల్పం!

## డా. మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం




**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ):** పశ్చిమ నియోజకవర్గంలో డా. మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశం నాయకులు, కార్యకర్తల భారీ హాజరుతో ఘనంగా విజయవంతమైంది ఈ సమావేశంలో మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్‌నాథ్ , పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు పాల్గొని పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యకర్తల్లో నెలకొన్న గందరగోళానికి తెరదించి, పార్టీ శ్రేణులందరికీ స్పష్టమైన దిశానిర్దేశం చేస్తూ ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు. వార్డు అధ్యక్షులు, మాజీకార్పొరేటర్లు, వార్డు పరిశీలకులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను, పార్టీ పట్ల అంకితభావాన్ని, నాయకత్వంపై విశ్వాసాన్ని చాటారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్త లంతా ఒకే సంకల్పంతో – 2029లో డా. మళ్ల విజయప్రసాద్ ఘన విజయం సాధించేలా సమష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఇది కేవలం ఒక సమావేశం కాదు... పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహానికి నాంది –2029 విజయానికి పశ్చిమ నియోజకవర్గం మోగించిన విజయ శంఖారావం అని నాయకులు పేర్కొన్నారు. మన ఐక్యతే మన బలం! మన కార్యకర్తలే మన శక్తి! అనే నినాదంతో సమావేశం ముగిసింది.

# కుసులువాడలో కుదేలవుతున్న ప్రభుత్వ భూమి..!!

- అధికారుల హెచ్చరికలు బేఖాతరు
- 20 సెంట్ల విలువైన స్థలంలో యథేచ్ఛగా పాక నిర్మాణం..
- రెవెన్యూ సిబ్బంది లాలూచీ

**ఆనందపురం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం కుసులువాడ ఎస్సీ కాలనీ సమీపంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే నంబర్ 248లో తారురోడ్డును ఆనుకుని ఉన్న సుమారు 20 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి పాక నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయల విలువైన ఈ స్థలాన్ని గతంలో రైతు భరోసా కేంద్రం కోసం అధికారులు కేటాయించినట్లు వారు తెలిపారు. కబ్జాపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇటీవల వీఆర్వో నరసింహులు స్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వ భూమిని ఆక్రమించడం శిక్షార్హమైన నేరమంటూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే కబ్జాదారులు ఆ బోర్డును పక్కకు పడేసి పాక నిర్మాణాన్ని కొనసాగించినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందడంతో ఆనందపురం తహసీల్దార్ కార్యాలయ అధికారులు, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపడుతున్నట్లు గుర్తించారు. కబ్జాదారులను హెచ్చరించి



నిర్మాణ పనులు నిలిపివేయాలని సూచించి అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే అధికారులు వెళ్లిన అనంతరం కూడా నిర్మాణం కొనసాగించి పాకను పూర్తిచేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం జరుగుతున్నట్లు అధికారులు స్వయంగా గుర్తించినప్పటికీ తదుపరి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక లాబీయింగ్ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన రెవెన్యూ యంత్రాంగం హెచ్చరికలకే పరిమితం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సర్వే నంబర్ 248లోని ప్రభుత్వ భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేసి, అక్రమ నిర్మాణాన్ని తొలగించి, ప్రభుత్వ భూమిని పరిరక్షించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




## అధిష్ఠానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం...!!

- రిజర్వేషన్ ఆధారంగా ఎంపీపీ లేదా జడ్పీటీసీగా బరిలోకి..
- మాజీ సర్పంచ్ చందక లక్ష్మి ప్రకటన



**ఆనందపురం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే ఆనందపురం మండలం నుంచి పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు మాజీ సర్పంచ్ చందక లక్ష్మి తెలిపారు. పార్టీ పెద్దల సహకారంతో, రిజర్వేషన్‌కు అనుగుణంగా ఎంపీపీ లేదా జడ్పీటీసీ పదవికి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ ఏ విధంగా ఖరారవుతుందో దాని ఆధారంగా పోటీ చేసే పదవిని నిర్ణయించుకుంటామని చందక లక్ష్మి పేర్కొన్నారు. ఎంపీపీ పదవికి రిజర్వేషన్ అనుకూలిస్తే ఎంపీపీగా, జడ్పీటీసీ స్థానానికి రిజర్వేషన్ అనుకూలిస్తే జడ్పీటీసీగా పోటీ చేస్తానని తెలిపారు. అయితే తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందని, గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు, స్థానిక అవసరాలపై అవగాహన ఉందని ఆమె పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎన్నికల్లో పోటీ చేసి ప్రజలకు మరింత సేవ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సూచనలు, పార్టీ పెద్దల నిర్ణయానికి అనుగుణంగా ముందుకు సాగుతానని చందక లక్ష్మి తెలిపారు. రిజర్వేషన్ ఖరారైన అనంతరం పార్టీ నిర్ణయమే తన పోటీపై తుది నిర్ణయమని ఆమె పేర్కొన్నారు.

## ప్రమాదాలు జరగడం చూస్తుంటే ఏడుపొస్తోంది : సీపీ శంకబ్రత బాగ్చీ




**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** ప్రమాదాల నివారణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఒక్కోసారి జరుగుతున్న ఘటనలు చూస్తుంటే ఏడుపొస్తోందని నగర పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చీ అన్నారు. గాజువాక క్లబ్ హాల్లో సిఐ హుస్సేన్ అధ్యక్షతన ట్రాఫిక్ సోల్జర్స్ కు ఆరోగ్య బీమా పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇరాజ్ హాస్పిటల్ సౌజన్యంతో జరిగిన కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగర వ్యాప్తంగా ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం అదనపు సిబ్బంది నియామకం చేపడతామని తెలిపారు. త్వరలోనే అన్ని శాఖల అధికారులు, ప్రజా సంఘాలతో ఒక సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ కోసం అందరి సూచనలు, సలహాలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇంచార్జి ఏడీసీపీ అన్నెపు నరసింహమూర్తి, సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ భవ్యక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చిక్కా సత్యనారాయణ, కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి

### గణేష్ మండప నిర్వాహకులతో సమన్వయ సమావేశం - ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు, టౌన్ సీఐ ప్రేమ్ కుమార్



**అనకాపల్లి , సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో పోలీస్ అధికారులు ప్రత్యేక సమన్వయ సమావేశంటౌన్ పోలీస్ స్టేషన్ దగ్గరలో గెస్ట్ హౌస్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు , టౌన్ సీఐ జి.ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పండుగను శాంతియుత, ప్రశాంత వాతావరణంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని పిలుపునిచ్చారు వేడుకల సందర్భంగా మండపాల నిర్వాహకులు, ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన కీలక నిబంధనలు: ముందస్తు అనుమతులు: మండపాల ఏర్పాటుకు పోలీస్, రెవెన్యూ, విద్యుత్ మరియు మున్సిపల్ శాఖల నుండి తప్పని సరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలి. ట్రాఫిక్కు, పాదచారులకు ఆటంకం కలిగించే రీతిలో రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయరాదు. విద్యుత్ భద్రత: వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ సరఫరా వైరింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సర్టిఫైడ్ ఎలక్ట్రీషియన్ల ద్వారానే నాణ్యమైన వైర్లు, స్విచ్ బోర్డులు వాడాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అందరూ సహకరించి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని అధికారులు కోరారు.

## పరవాడలో వరసిద్ధి వినాయక మహోత్సవాలు

**పరవాడ , సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** పరవాడ మండలంలోని ఎన్డీఏ ఉమ్మడి కార్యాలయం వద్ద శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు కూటమి ప్రతినిధులు తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హోమం, అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు ఆదివారం వెల్లడించారు.

# పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌ను యథావిధిగా నిర్వహించాలి

- ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలి
- 1100 టోల్‌ఫ్రీ, మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదుల నమోదు
- క్యూఆర్ కోడ్ ద్వారా సేవలపై అభిప్రాయం తెలిపే అవకాశం
: జిల్లా కలెక్టర్ టి. నిశాంతి



**పాడేరు, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** ప్రజల సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో భాగంగా పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌ను యథావిధిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పీజీఆర్ఎస్ కేంద్రాల్లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా పరిశీలించి సత్వర పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్హత పత్రాలు, అవసరమైన వివరాలతో నేరుగా హాజరై అర్జీలు సమర్పించుకోవచ్చని తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి నేరుగా హాజరు కాలేని ప్రజలు 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చని, అలాగే మీకోసం వెబ్‌సైట్ (meekosam.ap.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే సమర్పించిన అర్జీల స్థితి, పరిష్కార పురోగతిని తెలుసుకునేందుకు కూడా 1100 నంబర్‌ను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ సేవలను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించేందుకు జిల్లా, మండల స్థాయి కేంద్రాల్లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత సేవలను పొందిన అనంతరం ప్రజలు తమ మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై తమ అనుభవం, అభిప్రాయాలను నమోదు చేయాలని కోరారు. పీజీఆర్ఎస్‌లో పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల నుంచి వచ్చే అసంతృప్తి స్పందనలను జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా సమీక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుదారులతో సంబంధిత అధికారులు నేరుగా మాట్లాడి సమస్య స్వరూపాన్ని పూర్తిగా తెలుసుకుని, వారికి సంతృప్తికరమైన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం, 1100 కాల్ సెంటర్, సూపర్ ఆడిట్ తదితర మార్గాల ద్వారా గుర్తించే అసంతృప్తి ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా విధి నిర్వహణలో లోపాలు ఉన్నట్లు తేలితే బాధ్యులైన అధికారులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడంతో పాటు, చేపట్టిన చర్యల నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా కూడా వివిధ పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలు 1100, మీకోసం వెబ్‌సైట్, వాట్సాప్ గవర్నెన్స్ తదితర అందుబాటులో ఉన్న మార్గాలను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని ఆమె కోరారు.

## గంజాయి కేసుల నిందితుడు మీసాల సాయి సుమంత్ పై పీడీ యాక్ట్ - విజయనగరం జిల్లా ఎస్పీ

నిందితుడిని విశాఖ కేంద్ర కారాగారానికి తరలింపు



**విజయనగరం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** చట్టాన్ని తరచూ ఉల్లంఘిస్తూ గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగానికి పాల్పడుతూ కింగ్ పిన్‌గా వ్యవహరిస్తున్న నిందితుడు మీసాల సాయి సుమంత్ (27 సం.లు) పై పీడీ యాక్ట్ ప్రయోగించామని జిల్లా ఎస్పీ లిఎ.ఆర్. దామోదర్, లి తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటకు చెంది, ప్రస్తుతం విజయనగరం మండలం చెల్లూరు గ్రామంలో నివాసం ఉంటున్న సాయి సుమంత్ పై గంజాయికి సంబంధించి పలు కేసులు ప్రస్తుతం పలు న్యాయస్థానాల్లో విచారణలో ఉన్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, సమాజానికి ప్రమాదకరంగా మారుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఒక సంవత్సరం పాటు బెయిల్ మంజూరు కాకుండా చేసి, విశాఖపట్నం కేంద్ర కారాగారానికి తరలించామని తెలిపారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా, వినియోగించినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ హెచ్చరించారు.

## అరిలోవలో గంజాయి అక్రమ రవాణా ముఠా పట్టివేత..5 గురు అరెస్ట్

3.055 కేజీల గంజాయి, స్కూటీ, 5 ఫోన్లు స్వాధీనం - ముగ్గురు పరారీ



**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** అరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం సుమారు 12.00 గంటల సమయంలో విమ్స్ హాస్పిటల్ సమీపంలో అరిలోవ ఎస్ఐ కృష్ణలి ఆధ్వర్యంలో సిటీ టాస్క్ ఫోర్స్ (CTF) సిబ్బంది మరియు పోలీసు సిబ్బంది కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న ప్యాకెట్లను మధ్యవర్తుల సమక్షంలో తనిఖీ చేయగా ఎండిన గంజాయి ఆకులు, పుష్పాలు మరియు కాండాలు లభించాయి. ఈ కేసులో A1 బొబ్బిలి దినేష్ కుమార్ ఏ దినేష్, A2 కడుపుట్ల సందీప్,A3 మోకా రిషేంద్ర, A4 తోట యశ్వంత్ మరియు A5 ధనలిలను అరెస్ట్ చేశారు. లిA6 ధన, A7 కట్టా రాము,-ూ8 సుంకర గౌతమ్ పరారీలో ఉన్నట్లు గుర్తించి, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అరెస్టు చేసిన నిందితుల వద్ద నుండి మొత్తం 3.055 కిలోల గంజాయి, ఒక యాక్టివా స్కూటీ మరియు 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అరిలోవ పోలీస్ స్టేషన్ క్రైమ్ నం.261/2026, సెక్షన్ 20(ఎ)(ii)(B) r/w 8(ఎ) ఎన్డీపీఎస్ యాక్ట్, 1985 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసును అరిలోవ సీఐ శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు. నిందితులలో కొందరికి గతంలో కూడా గంజాయి/ఇతర నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. గంజాయి అక్రమ రవాణా, విక్రయం మరియు వినియోగానికి పాల్పడే వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అరిలోవ పోలీసులు తెలిపారు.

## బాల వినాయకుడికి వెండి మకర తోరణం బహూకరణ

3.5 కేజీల వెండితో తోరణం - స్పీకర్ సతీమణి పద్మావతి చేతుల మీదుగా అందజేత

**నర్సీపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** నర్సీపట్నం 5 రోడ్ల జంక్షన్ వద్ద కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ బాల వినాయక స్వామివారికి ఆదివారం ఘనంగా వెండి మకర తోరణాన్ని బహూకరించారు. ఆలయ కమిటీ మరియు భక్తుల సహాయ సహకారాలతో సుమారు 3 కేజీల 500 గ్రాముల వెండితో ఈ ప్రతిష్టాత్మకమైన మకర తోరణాన్ని తయారు చేయించారు. శాసనసభ స్పీకర్ గౌరవ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి లి చింతకాయల పద్మావతిలి చేతుల మీదుగా ఈ తోరణాన్ని స్వామివారికి అందజేశారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించి అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. ఈ బహూకరణ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్యంగా ఆలయ కమిటీ చైర్మన్ దనిమిరెడ్డి తాతాజీ (బుజ్జి), వైస్ చైర్మన్ ఫణి, సెక్రటరీ గోవింద, కోశాధికారి గౌరి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మడక పార్వతి రమేష్



**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ను పరవాడ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు మడక పార్వతీ రమేష్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వార్డులో బిజెపి పరిస్థితి, పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలో ఎవరికి సీటు కేటాయించిన కలిసి ఐక్యంగా పనిచేసి వారి గెలుపుకు కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సెప్టెంబర్ 17వ తారీకు నుండి అక్టోబర్ 17 వ తారీకు వరకు ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్వతీ రమేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీకి ఎక్కువ కార్పొరేటర్ సీట్లు కేటాయించే విధంగా అధినాయకత్వం కృషి చేయాలని, నూతనంగా ఏర్పాటు అయినా 106వ వార్డులో బిజెపి పార్టీ బలంగా ఉందని, పార్టీ ఆదేశిస్తే 106వ వార్డు నుంచి కార్పొరేటర్ గా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలియజేశారు. కూటమిలోని అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలతో సమన్వయం చేసుకొని 106వ వార్డులో బిజెపి జెండా ఎగరవేసేందుకు తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు.

## మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం
## పర్యావరణాన్ని కాపాడుకుందాం : పిసిసి జనరల్ సెక్రెటరీ జగతా శ్రీనివాస్




**పాయకరావుపేట, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని, పర్యావరణాన్ని కాపాడుకుందామని పిసిసి జనరల్ సెక్రెటరీ జగతా శ్రీనివాస్ అన్నారు. మహీంద్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వినాయక చవితి పురస్కరించుకొని 200 మట్టి వినాయక విగ్రహాలను, వినాయక వ్రత పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు రంగురంగుల విగ్రహాలు మాని, మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొంతిన అనిల్, కట్టా వీరబాబు, మేడిశెట్టి రామకృష్ణ నారాయణ( దివాణం), పెదిరెడ్డి శ్రీను, జగతా వీరబాబు, వామాల శ్రీను, గంటా బాబూరావు పాల్గొన్నారు.

# గణనాథుని రాకకు విశాఖ ముస్తాబు

## మార్కెట్లలో కొనుగోళ్ల సందడి పూజా సామగ్రి, గణపతి బొమ్మలకు గిరాకీ

**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** వినాయక చవితి పండుగకు సమయం దగ్గరపడుతుండటంతో విశాఖ నగరంలోని ప్రధాన మార్కెట్లు సందడిగా మారాయి. పండుగను ఘనంగా నిర్వహించేందుకు నగరవాసులు ముందస్తు కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. దీంతో వినాయక విగ్రహాలు, పూజా సామగ్రి, పూలు, పండ్లు, అలంకరణ వస్తువుల దుకాణాల వద్ద కొనుగోలుదారుల రద్దీ కనిపిస్తోంది. వినాయకుడి పూజకు అవసరమైన పత్రి, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, దీప సామగ్రి తదితర పూజా వస్తువుల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పూర్ణా మార్కెట్, అక్కయ్యపాలెం, కంచరపాలెం, రైల్వే న్యూ కోలని, మద్రిపాలెం, ఎం వి పి కాలని, మద్దిలపాలెం, ఇలా అనేక ప్రాంతాల్లో పండుగకు అవసరమైన సామగ్రిని ఒకేసారి కొనుగోలు చేసేందుకు కుటుంబాలతో కలిసి మార్కెట్లకు వస్తుండటంతో ఆదివారం సాయంత్రం ప్రధాన వ్యాపార ప్రాంతాలు సందడిగా, రద్దీగా మారాయి. వినాయక చవితి నేపథ్యంలో పూలు, పండ్లు, పూజా సామగ్రి, అలంకరణ వస్తువులు, విగ్రహాల విక్రయాలు 'పెరగడంతో వ్యాపారుల్లోనూ ఉత్సాహం నెలకొంది. పండుగకు ముందు రోజుల్లో కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు కుటుంబాలు సిద్ధమవుతున్నాయి. మరోవైపు వివిధ ప్రాంతాల్లో యువత, ఉత్సవ కమిటీలు గణనాథుడి ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో విశాఖ నగరంలో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం




నెలకొంది.

**కొలువుదీరనున్న గణనాథులు..**

వినాయక చవితిని పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న మండపాల కోసం నిర్వాహకులు తమకు నచ్చిన గణనాథుల విగ్రహాలను ఎంపిక చేసుకుంటున్నారు. చిన్న విగ్రహాల నుంచి భారీ విగ్రహాల వరకు వివిధ ఆకృతులు, రూపాల్లో గణనాథులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయ రూపాలతో పాటు ఆకట్టుకునే అలంకరణలతో రూపొందించిన విగ్రహాలకు కూడా డిమాండ్ కనిపిస్తోంది.

## గాజువాకలో అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

### 5 మద్యం సీసాలు స్వాధీనం - సీఐ వాసు నాయుడు



**గాజువాక, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** గాజువాక పోలీస్ స్టేషన్ సీఐ వాసు నాయుడు ఆదేశాల మేరకు, ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి కుంచుమాంబ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మాటూరి గణేష్, వయస్సు 32 సంవత్సరాలు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి అక్రమంగా విక్రయించేందుకు ఉంచిన 5 మద్యం సీసాలు (ప్రతి ఒక్కటి 180 మీ) స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై గాజువాక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వాసు నాయుడు తెలిపారు. ప్రజలు అక్రమ మద్యం విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాల్లో బోర్డు సభ్యురాలు చల్లా కృష్ణవేణి ప్రత్యేక కార్యక్రమాలు

### పందిరి ఆట, మట్టి విగ్రహాల పంపిణీ



**దేవరాపల్లి , సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారి 21 రోజుల వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్న వేళ.. దేవస్థానం ఈవో బోర్డు సభ్యురాలు చల్లా కృష్ణవేణి ఆధ్వర్యంలో భక్తి, సంస్కృతి, పర్యావరణ సందేశాన్ని చాటే కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో సంప్రదాయ పందిరి ఆ వేడుకను దేవస్థానం ఈవో బోర్డు సభ్యులు తో కలిపి చల్లా కృష్ణవేణి ప్రారంభించారు. భక్తులు, మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఆటలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పందిరి ఆట ద్వారా మన పూర్వ సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడమే లక్ష్యమని ఆమె అన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా భక్తులందరికీ మట్టి వినాయక విగ్రహాలను చల్లా కృష్ణవేణి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. "కాణిపాకం స్వామివారు స్వయంభుగా వెలిసిన మహిమాన్విత క్షేత్రం. స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రపంచ ప్రసిద్ధి. భక్తులంతా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండి, పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలనే పూజించాలి. దేవస్థానం తరపున ఈ చిన్న ప్రయత్నం చేస్తున్నాం. భక్తులందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, అర్చకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితుల గోడు పార్లమెంటులో వినిపిస్తా

- నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాడతా
- కాంటూరు కష్టాల నుంచి నిర్వాసితులకు విముక్తి కల్పించాలి
- నిర్వాసితుల కన్నీళ్లకు పరిహారమే సమాధానం
- 18 ఏళ్లు నిండిన ప్రతి నిర్వాసితుడికి పరిహారం ఇవ్వాలి
- ముంపు గ్రామాల బాధలు ఢిల్లీ దాకా తీసుకెళ్తా
- పోలవరం నిర్వాసితుల సమస్యలపై పార్లమెంటులో గళమెత్తుతా
- కాంటూరు పేరుతో నిర్వాసితులకు అన్యాయం చేయొద్దు
- భూములు పోయాయి.. ఇళ్లు పోయాయి.. న్యాయం మాత్రం దక్కలేదు
- నిర్వాసితుల బతుకులకు న్యాయం చేయాలి-ఎంపీ తనుజారాణి



**పోలవరం , సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** పోలవరం ప్రాజెక్టు కారణంగా సర్వం కోల్పోయి పునరావాసం కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితుల సమస్యలను రాబోయే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బలంగా ప్రస్తావించి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి హామీ ఇచ్చారు. చింతూరు మండలం కుమ్మూరులో పోలవరం నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మితో కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన నిర్వాసితులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు.

**క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే పర్యటన-వైఎస్ఆర్సిపి**

నిర్వాసితుల సమస్యలు కేవలం కాగితాలపై కాకుండా క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల్లో రెండ్రోజుల పాటు పర్యటించినట్లు తనూజారాణి తెలిపారు. భూములు, ఇళ్లు, ఆర్‌అండ్‌ఆర్ పరిహారం విషయంలో అనేకమందికి ఇప్పటికీ పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదన్నారు. కాంటూరు లెక్కల పేరుతో ముంపు గ్రామాలను పట్టించుకోకపోవడం వల్ల ప్రతి వర్షాకాలంలో గిరిజన కుటుంబాలు వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**చిన్న వరదకే మునిగిపోతున్న గ్రామాల్లో పట్టించుకోరా?-- ఎంపీ**

45.75 కాంటూరులో ఉన్న అనేక గ్రామాలు చిన్నపాటి వరదలకే ముంపునకు గురవుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. ఆయా గ్రామాలను 41.25 కాంటూరులో చేర్చాలని ప్రజలు ఎన్నోసార్లు కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. గ్రామాలు ముంపునకు గురవుతున్న వాస్తవ పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.



**18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పరిహారం ఇవ్వాలి**

కటాఫ్ తేదీ కారణంగా 18 ఏళ్లు నిండిన అనేకమంది యువతీ యువకులు పరిహారం జాబితాలో చోటు కోల్పోయారని ఎంపీ తెలిపారు. గ్రామాలను ఖాళీ చేసే సమయానికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

**నిర్వాసితుల సమస్యలపై పార్లమెంట్లో పోరాడుతా**

నిర్వాసితుల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడంతో పాటు సంబంధిత కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**32 గ్రామాలను ముంపులో చేర్చింది వైఎస్ జగన్ ప్రభుత్వమే**

మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ 2022 వరదల సమయంలో ఈ ప్రాంత ప్రజలు పడిన కష్టాలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా పరిశీలించి, ప్రాధాన్యతా క్రమంలో 32 గ్రామాలను ముంపు పరిధిలోకి తీసుకువచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఆ గ్రామాల ప్రజలకు పరిహారం అందుతుంటే కూటమి నాయకులు దానిని తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో వేరే ప్రభుత్వం ఉన్నప్పటికీ వైఎస్ జగన్ తన ప్రభావంతో 32 గ్రామాలను ముంపు పరిధిలోకి తీసుకువచ్చారని, కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ గడిచిన కాలంలో ఒక్క కొత్త గ్రామాన్ని కూడా ముంపు పరిధిలోకి తీసుకురాలేకపోయిందని విమర్శించారు.

**కోరుకున్నచోటే పునరావాసం కల్పించాలి**

నిర్వాసితులు కోరుకున్న ప్రాంతాల్లో పునరావాసం కల్పించకుండా, అర్హులకు పరిహారం అందించకుండా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ధనలక్ష్మి ఆరోపించారు. పరిహారం విషయంలో అర్హులకు అన్యాయం చేస్తూ, అనర్హులకు ప్రయోజనం కల్పిస్తున్నారనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి వ్యవహారాలపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

**స్పోర్ట్స్ కోటాలోనూ అన్యాయం**

కుమ్మూరు గ్రామానికి చెందిన విలువిద్య క్రీడాకారుడు అణిగి దుర్గయ్య బంగారు పతకం సాధించినప్పటికీ అర్హత ఉన్నా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం రాలేదని ధనలక్ష్మి తెలిపారు. అర్హత లేనివారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కల్పిస్తూ అర్హులైన గిరిజన యువతకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన పోలవరం నిర్వాసితుల నుంచి వారి సమస్యలను ఎంపీ తనూజారాణి, ధనలక్ష్మి అడిగి తెలుసుకున్నారు. భూములు, ఇళ్లు, పరిహారం, పునరావాసం, కాంటూరు సమస్యలు తదితర అంశాలపై నిర్వాసితులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ జక్రియా, పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు కోట్ల కృష్ణ, కురసం నాగేశ్వరరావు, రాంప్రసాద్, మురళి, మాజీ సర్పంచులు ముచ్చిక నాగార్జున, కారం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

### మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం - పిలుపు

**కోటబొమ్మాళి, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** రేపు వినాయక చవితి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి లికింజరాపు అచ్చెన్నాయుడు లి హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించే ఈ పవిత్రమైన రోజున ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు. వినాయకుడి అనుగ్రహంతో ప్రజల జీవితాల్లో ఎదురయ్యే అన్ని విఘ్నాలు తొలగిపోయి, ప్రతి ఒక్కరూ సంతోషంగా, ప్రశాంతంగా జీవించాలన్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం తదితర రంగాల్లో ప్రజలు మరింత అభివృద్ధి సాధించాలని, యువతకు ఉజ్వల భవిష్యత్ లభించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరారు. వినాయక చవితి వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని మంత్రి పిలుపు

# మా రేపాక నిర్వాసితులకు భూమి ప్యాకేజీ, పునరావాసం కల్పించాలి

### 22 ఏళ్లుగా సమస్యలు పరిష్కరించని ప్రభుత్వాలపై గ్రామస్తుల ఆగ్రహం



**కూనవరం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా నష్టపరిహారం చెల్లించకపోవడం, ముంపు సమస్యను తీవ్రతరం చేయడం అన్యాయమని రేపాక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రేపాక గ్రామానికి భూమి ప్యాకేజీ, ఆర్అండ్ఆర్, పునరావాసం వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలో పీసా గ్రామసభ సమావేశం నిర్వహించి నిర్వాసితుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పేసా కార్యదర్శి మడకం బొజ్జి మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమై 22 సంవత్సరాలు గడుస్తున్నా నిర్వాసితుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గ్రామాన్ని ఖాళీ చేయించేందుకు 2017, 2019 సంవత్సరాల్లో ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు భూమి ప్యాకేజీ, ఆర్అండ్ఆర్, పునరావాసం కల్పించలేదని తెలిపారు. నిర్వాసితులను తరలించడంలో చూపుతున్న తొందరను, పరిహారం చెల్లించడంలో ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణం కారణంగా గ్రామ భూములు, పంటలపై బ్యాక్‌వాటర్ ప్రభావం పడుతోందని గ్రామస్తులు తెలిపారు. సరైన సమయంలో పంటలు సాగు చేసుకోలేకపోతున్నామని, సాగు చేసిన పంటలకు ఆశించిన దిగుబడులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్నా చివరకు అప్పులే మిగులుతున్నాయని వాపోయారు. భూములు, జీవనాధారాన్ని కోల్పోతున్నప్పటికీ ప్రభుత్వం పరిహారం, పునరావాసం విషయంలో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా స్పందించి మారేపాక గ్రామానికి సంబంధించిన భూమి ప్యాకేజీ, పరిహారం, ఆర్అండ్ఆర్, పునరావాస ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లడం సరికాదన్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికారులు తక్షణమే గ్రామానికి వచ్చి భూమి ప్యాకేజీ, పరిహారం, పునరావాసంపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా, ముట్టడి వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాయం సీతారామయ్య, బాబు బొర్రయ్య, మడకం నాగమణి, పాయం సత్యనారాయణ, పేసా అధ్యక్షులు మడకం రత్తయ్య, గ్రామస్తులు ఆసురత్తయ్య, మడకం కన్నారావు, ధర్మల కన్నారావు, మడకం జోగయ్య తదితర గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ ఎర్నిమాంబ దేవాలయ షెడ్లు పునర్నిర్మించండి

**- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్**
**- వర్షంలోనూ రోడ్డుపై బైఠాయించి భక్తులతో కలిసి నిరసన**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే సంతాన లక్ష్మిగా విరాజిల్లుతున్న జ్ఞానాపురం శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ షెడ్ల కూల్చివేత చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యమని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు, వైసీపీ శ్రేణులతో కలిసి ఆదివారం ఉదయం అమ్మవారి ఆలయ ప్రాంతంలో కూల్చిన షెడ్ల వద్ద వర్షంలో తడుస్తూ రోడ్డుపైనే కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో రోడ్లు రాకముందు నుండే మత్స్యకారులు, స్థానిక పూర్వీకులు అమ్మవారిని ప్రతిష్ఠించారని, దీర్ఘకాలిక భయంకర రోగాల బారి నుండి రక్షించేందుకు అమ్మవారిని ప్రతిష్ఠించారని గుర్తు చేశారు. అంతటి మహిమగల ఆలయ అభివృద్ధికి ఆటంకం కలిగించడం దుర్మార్గమని కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. భక్తుల తలనీలాల సమర్పణ, గాజుల మొక్కుబడులు చెల్లించే ప్రదేశాల్లో నీడనిచ్చేందుకు ఓ దాత విరాళంతో షెడ్లు నిర్మించారని, ఉన్నపళంగా తాగునీటి పైపులతో సహా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేయడం సిగ్గుచేటని అన్నారు. స్థానిక జనసేన ఎమ్మెల్యే ఒక్క ఫోన్ కాల్ తో






అడ్డుకోగలరని, కానీ అలా జరగలేదన్నారు.

"ఇది అమ్మవారి ప్రాంతం, షెడ్లు తొలగించడానికి మీరెవరు? చేసిన తప్పులపై అమ్మవారిని క్షమాపణ కోరండి" అని డిమాండ్ చేశారు. గంజాయి, అసాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే సాకుతో షెడ్లు కూల్చామని కూటమి నేతలు చెప్పడం దారుణమని, సనాతన ధర్మం అని చెప్పుకునే పవన్ కళ్యాణ్, స్థానిక జనసేన ఎమ్మెల్యే ఆలయానికి అన్యాయం జరిగితే మాట్లాడరా? అని మండిపడ్డారు. ఇది చంద్రబాబు, నారా లోకేష్ వక్ర బుద్ధికి నిదర్శనమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చిన్న తట్ట కూడా తొలగించకుండా ఆలయ పవిత్రతను కాపాడామని, ప్రతి లక్ష్మీవారం, మంగళవారం, ఆదివారం ఉత్తరాంధ్ర నుండి వేలాది మంది భక్తులు వస్తున్నారని, వారికి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో తాము అధికారంలోకి రావడం ఖాయమని, ఆలయ ప్రతిష్ఠకు, భక్తుల సౌకర్యాలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జాయింట్ సెక్రటరీ లింగం శ్రీను, ఎర్నిమాంబ గుడి మాజీ చైర్మన్ లండ రమణ, మాజీ కార్పొరేటర్లు తోట పద్మావతి, పత్తిరిపిల్లి రాము, వార్డు అధ్యక్షులు నీలపు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు తదితర వైసీపీ నేతలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గాజువాకలో గాజుల గణపతి ఆగమనం

**- దుర్గ పీఠాధిపతి శ్రవణ చైతన్యానంద స్వామీజీ చేతుల మీదుగా ప్రారంభం**



**గాజువాక, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** గాజువాక గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీ దివ్య కంకణ మహా గణపతి (గాజుల గణపతి) ఆగమనం శ్రీ సమతానంద దుర్గ మహా పీఠాధిపతి శ్రీ శ్రవణ చైతన్యానంద చిన్న స్వామీజీ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో స్వామీజీతో పాటు బీజేపీ గాజువాక కన్వీనర్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, ప్రముఖ సినీ హీరో, టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ గంటా రవి తేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సనాతన హిందూ ధర్మంలో హిందువుల తొలి పండుగ వినాయక చవితి పురస్కరించుకుని గాజువాకలో గత 15 సంవత్సరాలుగా ఘనంగా ఉత్సవాలు జరుగుతున్నాయని అన్నారు. మహిళల సౌభాగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు గాజులతో గణపతి విగ్రహాన్ని తయారు చేయించారని తెలిపారు. అనకాపల్లికి చెందిన కళాకారుడు ఆరిపాక కృష్ణ బృందం గత నెల రోజులుగా కష్టపడి విగ్రహాన్ని తయారు చేశారని, ఎటువంటి టికెట్లు లేకుండా భక్తులకు ఉచితంగా దర్శనం కల్పించేందుకు నిర్వాహకులు కొసిరెడ్డి పృథ్వీ, గణేష్ అన్ని ఏర్పాట్లు చేశారని తెలిపారు. మండప ఎలివేషన్‌లో హిందూ ధర్మ పరిరక్షకులు మరాఠా మహారాజ్ ఛత్రపతి శివాజీ మహారాజ్ మరియు వినాయక చవితి ఉత్సవాలను భారతదేశంలో తొలిసారిగా ప్రారంభించిన బాలగంగాధర్ తిలక్ చిత్రపటాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది కృష్ణారెడ్డి, బగ్గు ఈశ్వరరావు, ఈగలపాటి యువశ్రీ, ములకలపల్లి ప్రకాష్, కే వెంకటరమణ తదితర భారీ సంఖ్యలో మహిళలు, యువకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# గాజువాకలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

### అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరిక - ఎస్ఐ రామకృష్ణ





**గాజువాక, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** గాజువాక పోలీస్ స్టేషన్ సీఐ వాసు నాయుడు ఆదేశాల మేరకు ఈరోజు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్ల ప్రవర్తన, వారి కార్యకలాపాలపై ఆరా తీసి, ఇకపై ఎటువంటి అసాంఘిక మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరించినా, చట్టాన్ని ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవిస్తూ ప్రశాంతమైన జీవనం సాగించాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు.

# మట్టి వినాయకుడినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం



**ఆనందపురం , సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** “మన ఊరు.. మన మట్టి.. మన గణపతి” నినాదంతో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని వేములవలస ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ రౌతు నాగరాజు కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు డాక్టర్ సందీప్ పంచకర్ల సూచనలతో ఈ మేరకు ప్రజలకు పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని నాగరాజు తెలిపారు. మట్టి విగ్రహాలు నిమజ్జనం అనంతరం సహజంగా భూమిలో కలిసిపోతాయని, తద్వారా నీటి వనరులు కలుషితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించి పర్యావరణాన్ని కాపాడేందుకు తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని ఆయన కోరారు.

# శ్రీకృష్ణుని సన్నిధిలో పరవాడ వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు



**పరవాడ , సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** భక్తిశ్రద్ధలు,ఆధ్యాత్మిక శోభ నడుమ పరవాడ మండలం కలపాక పంచాయతీ పరిధిలోని గొల్లలపాలెం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కన్నులపండువగా సాగాయి.ఆదివారం నిర్వహించిన కృష్ణుడి విగ్రహ నిమజ్జన మహోత్సవంలో మండల వైస్ ఎంపీపీ,అనకాపల్లి జిల్లా వైయస్సార్సీపీ కార్యదర్శి బంధం నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
?స్థానిక ఎంపీటీసీ సప్ప ప్రభ సన్యాసిరావు మరియు ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు విగ్రహాన్ని దర్శించుకున్న నాగేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు.అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి, గ్రామానికి,ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాన్ని ప్రసాదించాలని ఆ వేణుగోపాలుడిని ప్రార్థించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు,గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కృష్ణాష్టమి సంబరాలను ఘనంగా ముగించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సప్ప ప్రభ సన్యాసిరావు,సప్ప అప్పలనాయుడు,మొల్లి కనకరాజు,గ్రామ పెద్దలు బట్ట సింహాచలం,బొట్ట కనకారావు,సారిపల్లి నర్సింగరావు,మొల్లి అప్పలరాజు,ఇస్సారపు అప్పలనాయుడు,మొల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



### జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు

# సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానం

**అనకాపల్లి , సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా కూంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కోరాడ అప్పలరాజు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి ఎంపికై కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎం ఎల్ ఎ శ్రీ కొణతాల రామకృష్ణ, జిల్లా విద్యా శాఖాధికారి నాగేశ్వరావు చేతులు మీదుగా అవార్డు పొందడంతో సహచర ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి ఘనంగా సన్మానించారు. తమ సహోపాధ్యాయుడు కవిగా రచయితగా పాఠ్య పుస్తక రచయితగా పేరు తెచ్చుకోవడం తమకు సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం గణిత ఉపాధ్యాయులు శ్రీ ఎన్ ఎస్ రాజా మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

# నగరానికి సరిపడా తాగునీరు



**విశాఖపట్నం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) :** విశాఖ నగర అవసరాలకు సరిపడా నీటి లభ్యత ఉందని, ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ స్పష్టం చేశారు. నీటి సరఫరాలో లోపాలకు తావులేకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ పలమరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు సుధాకర్, మురళీకృష్ణతో కలిసి ఎండాడ రిజర్వాయర్‌ను ఆదివారం కమిషనర్ పరిశీలించారు. రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం, సరఫరా జరుగుతున్న వార్డులు, ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్న ప్రాంతాలు, బల్క్ కనెక్షన్లు, పెండింగ్ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాటిపూడి రిజర్వాయర్ నుంచి వివిధ ప్రాంతాలకు జరుగుతున్న సరఫరాపైనా సమీక్షించారు. ప్రస్తుత నీటి నిల్వలు, ప్రాంతాలవారీ అవసరాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెద్ద గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ భవనాలకు అవసరమైన నీటిని అందించేందుకు జీవీఎంసీ బల్క్, సెమీ బల్క్ కనెక్షన్ల సదుపాయం కల్పిస్తోందని కమిషనర్ తెలిపారు. నిర్ణీత ఛార్జీలు, వ్యయం చెల్లించిన అనంతరం సాంకేతిక సాధ్యాసాధ్యాలను బట్టి సమీపంలోని ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్ లేదా సంప్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. జీవీఎంసీ ఇప్పటివరకు 135 బల్క్, 8,100కుపైగా సెమీ బల్క్ కనెక్షన్లు మంజూరు చేసిందని చెప్పారు. వీటి ద్వారా రోజుకు లక్ష కిలోలీటర్లకుపైగా నీటిని సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. నగరంలోని మరో 60 పెద్ద గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య సంస్థలు బల్క్ కనెక్షన్లు తీసుకోకుండా భూగర్భ జలాలను వినియోగిస్తున్నట్లు ఇటీవల నిర్వహించిన పరిశీలనలో గుర్తించామని కమిషనర్ తెలిపారు. బోరుబావులు, ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడటం వల్ల స్థిరమైన నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఆ సంస్థలు జీవీఎంసీ బల్క్ వాటర్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిర్ణీత ఛార్జీలు చెల్లించిన అనంతరం మూడు నెలల్లో కనెక్షన్ కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనధికారికంగా భూగర్భ జలాలను వినియోగించడం వల్ల నీటిమట్టాలు తగ్గే ప్రమాదం ఉన్నందున ఆ విధానాన్ని నిలిపివేయాలని కోరారు. ఎండాడ రిజర్వాయర్ పరిశీలన అనంతరం ఎంవీవీ సిటీ అపార్ట్‌మెంట్ ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి తమ నీటి సమస్యను వివరించారు. ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదని తెలిపారు. బల్క్ కనెక్షన్ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసినట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దరఖాస్తును త్వరితగతిన పరిశీలించి బల్క్ వాటర్ కనెక్షన్ మంజూరు చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.